ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని నర్కూడలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు ఆర్థిక సాయం ఇవ్వడం చరిత్రలోనే మొదటిసారి అని అన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు సూచించారు. అనంతరం 85 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.

బండ్లగూడలో వంద రోజుల ప్రణాళిక షురూ


కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలో అనౌన్స్‌మెంట్ ప్రక్రియను పరిశీలించి తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలో భాగంగా కార్పొరేషన్ పరిధిలో అనేక కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఎస్‌ఐ జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ యూనిఫామ్‌ల అందజేత


ఉపాధ్యాయులకు యూనిఫామ్‌లను అందజేస్తున్న దృశ్యం

అత్తాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ వారికి మెరుగైన విద్యాబోధన లభిస్తుందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ మండల పరిధిలోని 46 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 10,035 స్కూల్ యూనిఫామ్‌లను రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ యూసీడీ పీవో ఎ.స్వాతి, సీవోల ఆధ్వర్యంలో పాఠశాలలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడం తమ బాధ్యత అన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

'మనూ' అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొ. వనజ

రాయదుర్గం: మనూలో 2025–26 విద్యా సంవత్సరంలో మెరిట్ ఆధారంగా వివిధ కోర్సులలో అడ్మిషన్ల దరఖాస్తు గడువు తేదీని పొడిగించినట్లు 'మనూ' అడ్మిషన్ల ప్రొఫెసర్ ఎం వనజ బుధవారం తెలిపారు. జూన్ 19 వరకు గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా వివిధ వర్గాల నుంచి వచ్చిన వినతులను దృష్టిలో పెట్టుకొని గడువు తేదీని పెంచినట్లు ఆమె వివరించారు. పీజీ డిప్లొమో ఇన్ టీచింగ్ ఇంగ్లిష్, నాలుగు పార్ట్ టైమ్ పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సులు, పది పార్ట్‌టైమ్ డిప్లొమో కోర్సు, ఏడు పార్ట్ టైమ్ సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమో అండ్ బీఎస్సీ ఇన్ ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్‌తో బాటు 24 వివిధ పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను, ఇతర వివరాల కోసం 040–23006612 ఎక్స్‌టెన్షన్ 1801 లో సంప్రదించాలన్నారు.

రేషన్ బియ్యం కోసం..

రాయదుర్గం: మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండడంతో రేషన్ దుకాణం వద్ద జనం బారులు తీరారు. గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలోని రేషన్ దుకాణం నుంచి నానక్‌రాంగూడ వాసులే కాకుండా గౌలిదొడ్డి, గోపన్‌పల్లితండావాసులు కూడా బియ్యం తీసుకెళ్లే పరిస్థితి ఉండడంతో క్యూకట్టారు. సాంకేతిక ఆలస్యం జరుగుతున్నా ప్రజలు వేచి ఉంటున్న పరిస్థితి కనపడుతోంది.

కబ్జా కోరల్లో ఫిరంగి కాలువ



- పట్టించుకోని అధికారులు
- వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు
- చెరువులు, కుంటల్లోకి చేరని వరద


బోటిగూడ వెళ్లే దారిలో ఫిరంగి కాలువను పూడ్చి కట్టపై నుంచి ఏర్పాటు చేసిన రోడ్డు


రామంజాపూర్ శివారులో ఫిరంగి కాలువకు రెండు పక్కల కాంక్రీటు నిర్మాణం

శంషాబాద్ రూరల్: శతాబ్ద కాలం నాటి సాగునీటి కాలువ కబ్జా కోరల్లో చిక్కుకుంటుంది.. రియల్ వ్యాపారుల అక్రమాలు, అధికారుల ఉదాసీన వైఖరి కారణంగా ఫిరంగి కాలువ కనుమరుగవుతోంది. కాలువను పూడ్చి భూముల్లో కలిపేసుకుంటున్నారు. కొన్ని చోట్ల కాలువను కుదించి కాంక్రీటు నిర్మాణాలు చేస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల పరిధిలో ఉన్న ఫిరంగి కాలువ కబ్జాకు గురవుతోంది. షాబాద్ మండలంలో ప్రారంభమై శంషాబాద్, రాజేంద్రనగర్, మహేశ్వరం, బాలాపూర్ మండలాల మీదుగా ఇబ్రహీపట్నం పెద్ద చెరువుకు చేరే ఈ ఫిరంగి కాలువ కబ్జాలబారిన పడి రోజురోజుకూ కుంచించుకుపోతోంది.

చెరువులకు గొలుసుకట్టుగా...

ఆయా మండలాల్లోని చెరువులు, కుంటలను అనుసంధానం చేస్తూ గొలుసుకట్టుగా సాగుతున్న ఫిరంగి కాలువను నిజాం హయాంలో ఏర్పాటు చేశారు. వర్షాలతో నిండిన చెరువులు, కుంటల్లోని వరద నీరు ఈ కాలువ ద్వారా పారుతూ ఇబ్రహీపట్నం పెద్ద చెరువుకు చేరేది. అప్పట్లో సాగు, తాగునీటి కోసం ఈ ఫిరంగి కాలువ ఎంతో ఉపయోగపడింది.

రియల్ ఎస్టేట్ పుంజుకోవడంతో...

మండలంలోని వ్యవసాయ భూములన్నీ రియల్ ఎస్టేట్ రాకతో వెంచర్లుగా వెలిశాయి. దీంతో భూములకు డిమాండ్ పెరిగి ధరలకు రెక్కలొచ్చాయి. దీని కారణంగా కాలువను ఆనుకుని ఉన్న భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేసిన రియల్టర్లు.. ఫిరంగి కాలువను చదును చేసి భూముల్లో కలిపేశారు. కాలువకు రెండు వైపులా ఉన్న కట్టను పూర్తిగా తొలగించి చదును చేశారు. కొన్ని చోట్ల కాలువను పూడ్చి రోడ్లు వేశారు.

రామంజాపూర్ నుంచి...

ఫిరంగి కాలువ షాబాద్ మండలం నుంచి రామంజాపూర్‌కు చేరుకుని ఆయా గ్రామాల మీదుగా రాజేంద్రనగర్ ప్రాంతానికి వెళ్తుంది. బోటిగూడ, ననాజీపూర్, అచ్చంపేట, పిల్లోనిగూడ, పిల్లోనిగూడ, పెద్దషాపూర్, చౌదరిగూడ, నర్కూడ, ఊట్‌పల్లి, తొండుపల్లి, శంషాబాద్, సాతంరాయి నుంచి రాజేంద్రనగర్ మండలంలోకి చేరుతుంది. అయితే ఆయా గ్రామాల్లో ఫిరంగి కాలువను ఇష్టానుసారంగా కబ్జా చేశారు. శంషాబాద్ పట్టణంలో కాలువపైనే నిర్మాణాలు సైతం చేపట్టారు.

వరద నీటికి అడ్డంకులు...

గొలుసుకట్టుగా ఉన్న ఫిరంగి కాలువ కబ్జా కావడంతో ఈ ప్రాంతంలో వరదనీటికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఇష్టారాజ్యంగా కాలువను పూడ్చివేయడంతో వరద సజావుగా ముందుకు సాగే పరిస్థితులు లేకుండా పోయాయి. దీంతో వరదనీరు దిశను మార్చుకుని పారుతుండడంతో చెరువులు, కుంటల్లోకి వరద చేరడంలేదు. దీంతో భూగర్భ జలాలు పెరగక.. నీటి కష్టాలు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొంటున్నాయి.

బుల్కాపూర్ నాలా కబ్జాలపై హైడ్రాకు ఫిర్యాదు

మణికొండ: అనాదిగా పలు గ్రామాల మీదుగా సాగుతూ భూగర్భ జలాలను పెంపొందిస్తున్న బుల్కాపూర్ నాలాను పలు ప్రాంతాల్లో కబ్జాలకు పాల్పడున్నారంటూ మణికొండ వాసులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుని నాలాను పరిరక్షించాలని కోరుతూ హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ, మణికొండ రెవెన్యూల పరిధిలో వెలసిన కొన్ని కాలనీల వాసులు లేఅవుట్‌లలో కొంత భూమి కొనుగోలు చేసి మరికొంత నాలా భూమిని ఆక్రమించి తప్పుడు అనుమతులతో నిర్మాణాలు చేస్తున్నారని అందులో వివరించారు. నాలా కనుమరుగు అవుతుండటంతో అందులో వెళ్లాల్సిన వర్షం నీరు మణికొండ గ్రామంలోకి రావటం, అనేక కాలనీలను ముంపుకు గురిచేస్తుందన్నారు. తమ భూములను ఎపుడో అమ్ముకుని ప్రస్తుతం కొందరు తిరిగి అమ్మకాలు చేసి అక్రమాలకు పాల్పడుతూ నాలాతో పాటు బఫర్ జోన్ ప్రాంతాన్ని కనుమరుగు చేస్తున్నారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరటంతో సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలోనే సమగ్ర నివేదిక తెప్పించి ఆక్రమణలను తొలగిస్తామని హామీ ఇచ్చినట్టు మణికొండ ప్రజల తరఫున స్థానిక నాయకుడు జి.రామలింగారెడ్డి తెలిపారు.

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించాలి


వ్యవసాయ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, రైతులు

మణికొండ: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించి లబ్ధిపొందాలని కృషి విజ్ఞాన కేంద్రం, కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ భార్గవి, డాక్టర్ డి.సుధీర్, డాక్టర్ వీర్ గౌతమ్ చౌహాన్ సూచించారు. బుధవారం నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి వార్డు కార్యాలయంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కొత్తగా వస్తున్న వ్యవసాయ సాంకేతికత, విధానాలు, అధిక లాభం చేకూర్చే ఉద్యాన వన పంట మెళకువలు, రొబోటిక్, ఆటోమేషన్‌లను వ్యవసాయంలో ఎలా ఉపయోగిస్తున్నారో వివరించారు. మట్టిని పరీక్షించుకుని పోషకాలను తెలుసుకుని ఎరువుల సమతుల్యత పాటించాలన్నారు. పశువులకు వచ్చే జబ్బులు వాటికి వివిధ గడ్డి జాతులలో లభిస్తున్న పోషకాలను గురించి తెలిపారు. వ్యవసాయంతో పాటు మేకలు, గొర్రెలు, కోళ్ల పెంచితే రైతులకు జీవనోపాధి భద్రతను కల్పించటంతో పాటు వ్యవసాయ ఆదాయాన్ని పెంపొందిస్తుందన్నారు. పంట మార్పిడి, సేంద్రియ వ్యవసాయ విధానాలు భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరచటంతో పాటు దిగుబడి పెంపు, దీర్ఘకాలికంగా స్థిరమైన వ్యవసాయ వ్యవస్థను నిర్మించటంలో కీలకంగా ఉంటాయన్నారు. మండల వ్యవసాయాధికారి కవిత, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీని పరిశీలించిన అదనపు కలెక్టర్


బియ్యం పంపిణీ తీరును తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

శంషాబాద్ మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి జరుగుతున్న పంపిణీ విధానాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ బుధవారం పరిశీలించారు. మున్సిపాలిటీలోని పలు రేషన్ దుకాణాల్లో పంపిణీ జరుగుతున్న తీరును డీలర్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. మూడు నెలల బియ్యం పంపిణీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కోటా వారిగా వేలిముద్రలు నమోదు చేసుకునే ప్రక్రియ ఆలస్యమవుతుందని డీలర్లు వివరించారు. డీలర్లు ఉదయమే దుకాణాలు తెరిచి టోకెన్లు అందజేసి సీరియల్‌గా బియ్యం పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. బియ్యం నిల్వలు కూడా సరిపడా ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత


తిమ్మారెడ్డి కుటుంబానికి బాండ్ అందజేస్తున్న సత్యనారాయణ, జైపాల్ రెడ్డి తదితరులు

రాజేంద్రనగర్: గత సంవత్సరం విద్యుదాఘాతంతో రాజేంద్రనగర్ సబ్ డివిజన్ పరిధిలోని మాలే తిమ్మారెడ్డి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా అన్వాడ మండలం మునిమోడం గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి బతుకు తెరువు కోసం నగరంలోని గండిపేట్ మండలం గంధంగూడ వెంకటేశ్వరనగర్‌కు వలస వచ్చాడు. గత సంవత్సరం జూన్ 7వ తేదీన కూలీ పనికి వెళ్లగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య మాలే సుశీల, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 4.50 లక్షలను బాండ్ల రూపంలో రాజేంద్రనగర్ సబ్ డివిజన్ ఏడీఈ సత్యనారాయణతో కలిసి వనంపల్లి జైపాల్ రెడ్డి ఇప్పించారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా కాటేదాన్ క్రీడాప్రాంగణం

- వసతులు కల్పించకుండానే స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం
- వెంటనే సౌకర్యాలు కల్పించాలి
- మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి


మాట్లాడుతున్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎలాంటి సౌకర్యాలు లేకుండా ప్రారంభించారని... దీంతో అలంకారప్రాయంగా ఉందని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నగరంలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన తోటి బీజేపీ కార్పొరేటర్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ కమిషనర్ గద్వాల్ విజయలక్ష్మీ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలం అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాల నుంచి 2014 నుంచి ఇప్పటి వరకు కౌన్సిల్ సమావేశంలో 15 సార్లు కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు సంబంధించిన ప్రశ్న వేశామన్నారు. 2009లో హెచ్‌ఎండీఏ వాళ్లు కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ని స్టార్ట్ చేస్తే 2014లో జీహెచ్‌ఎంసీ హ్యాండ్ ఓవర్ చేసి తర్వాత అప్పుడున్న కమిషనర్ జనార్దన్‌రెడ్డి, బొంతు రామోహన్‌కు కూడా ఎన్నోసార్లు వినతిపత్రాలు సమర్పించామన్నారు. నిధులు లేవని తప్పించుకుంటున్నారు కానీ అభివృద్ధి పనులు మాత్రం చేయడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల క్రీడా ప్రాంగణంలో కనీస వసతులు లేవన్నారు. డివిజన్ పరిధిలో ప్రజలు చాలా సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి తక్షణమే నిధులు మంజూరు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

అత్తాపూర్: విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికే పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలను అందజేస్తారని పీఆర్టీయూ రాజేంద్రనగర్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్, శ్రీనివాస్‌సాగర్ తెలిపారు. అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో రూ. 52 వేల ఖర్చు చేసినట్లు శ్రీనివాస్‌సాగర్ తెలిపారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన పిల్లలు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలో చేరుతూ వస్తున్నారని అలాంటి విద్యార్థులకు బోధనాంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యార్థులకు పాఠాలను చెబుతున్నట్లు ఆయన వివరించారు. పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు, స్థానికులు సహకరించిన పాఠశాలలను అభివృద్ధిలోకి వస్తాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన పద్మారావు

అత్తాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... శివరాంపల్లి ప్రాంతానికి చెందిన ఎస్.పద్మారావు(54) తాపీమేస్త్రీగా పనిచేస్తాడు. మంగళవారం రాత్రి పిల్లర్ నెంబర్ 254 ప్రాంతంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. పద్మారావు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు పద్మారావును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వడ్డెర సంఘం నేత వెంకటేష్ మృతి


వెంకటేష్ (ఫైల్)

బండ్లగూడ: వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌కు చెందిన వేముల వెంకటేష్(55) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఇరవై సంవత్సరాలుగా వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వడ్డెర జాతికి సేవలందిస్తున్నారు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలో వడ్డెర విద్యార్థి వసతి గృహం ఏర్పాటుకు ఆయన కృషి మరువలేనిది. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు బుధవారం కిస్మత్‌పూర్‌లోని శ్మశానవాటికలో నిర్వహిచారు.

పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి


పీరంచెరువులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పారిశుద్ధ్య సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహిస్తు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. బుధవారం 14వ డివిజన్‌లోని భవానీనగర్ కాలనీ, 16వ డివిజన్‌లోని హైదర్షాకోట్‌లలో డోర్ టూ డోర్ చెత్త సేకరణ ప్రక్రియను పరిశీలించారు. అలాగే 14వ డివిజన్‌లోని పీరంచెరువు, భవానీనగర్ కాలనీలలో రహదారిపై స్వీపింగ్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది పనులు చేసే సమయంలో మాస్క్, గ్లౌజ్, షూ ధరించాలన్నారు. రిఫ్లెక్టింగ్ జీహెచ్‌ఎంసీ జాకెట్‌ను ధరించి పనులు చేయాలన్నారు. ప్రధాన రహదారులను శుభ్రం చేయడం ప్రథమం అన్నారు. అనంతరం అన్ని బస్తీలు, కాలనీలను ఊడ్చి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలు చెత్త చెదారాలను రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దు అన్నారు. ప్రతి రోజు ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్లు వెంకటేష్, సుభాష్, రాము తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను తొలగించి యథేచ్ఛగా రాకపోకలు

'షార్ట్ కట్'తో ట్రాఫిక్‌కు అంతరాయం


ఇష్టారాజ్యంగా వెళ్తున్న వాహనదారులు

రాజేంద్రనగర్: శివరాంపల్లి పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 294 వద్ద గతంలో వాహనాల రాకపోకల కోసం డివైడర్‌ను తొలగించారు. వివిధ కారణాల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు సంవత్సరం క్రితం డివైడర్లను ఏర్పాటు చేసి రాకపోకలను మూసివేశారు. గత మూడు, నాలుగు రోజులుగా ఈ డివైడర్‌ను కొందరు తొలగించి రాకపోకలను నిర్వహిస్తున్నారు. దీంతో తరుచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. కొద్ది దూరం వెళ్లి అనంతరం యూ టర్న్ తీసుకునే బదులు ద్విచక్ర వాహనదారులు షార్ట్ కట్‌గా ఇక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నిస్తూ రోడ్డుపై బారులు తీరుతున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

వీసీని సత్కరించిన పూర్వ విద్యార్థులు


వీసీ ఐనుల్‌హసన్‌ను సన్మానించిన పూర్వవిద్యార్థులు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌ను విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి నాసిర్‌హుస్సేన్ షోయబ్ నాయకత్వంలో సంఘం ప్రతినిధుల బృందం వైస్‌చాన్సలర్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇటీవలే పద్మశ్రీ అందుకున్న నేపథ్యంలో ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉర్దూ సాహిత్యానికి హైదరాబాద్ చేసిన కృషిని ప్రశంసించారు. త్వరలో హిమాయత్‌నగర్‌లోని ఉర్దూ హాల్‌లో మహిళల కోసం కాలిగ్రఫీ తరగతులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంసీజే అండ్ పీఆర్‌ఓ అసోసియేట్ ప్రొ.డాక్టర్ మహ్మద్ ముస్తఫా అలీ పాల్గొన్నారు.

విత్తన సంస్థలలో కనీస వేతనాలు అమలు చేయాలి


కనీస వేతనాల నివేదికను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఈసీహెచ్‌ఓ సంస్థ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

రాయదుర్గం: విత్తన సంస్థలలో కనీస వేతనాలు అమలు చేయాలని, అందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఈసీహెచ్‌ఓ (ఎనేబ్లింగ్ చైల్డ్ అండ్ హ్యూమన్ రైట్స్ విత్ సీడ్ ఆర్గనైజేషన్స్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో ఒయాసిస్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం విత్తన రంగ ప్రతినిధులతో సీడ్ సప్లై చెయిన్‌లో కనీస వేతనాలు అమలు అనే అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో పలు చోట్ల విత్తనాల తయారీ సంస్థలలో పెద్ద సంఖ్యలో కార్మికులు పని చేస్తున్నారని వారికి ప్రభుత్వం నిర్దేశించిన రీతిలో కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కనీస వేతనాలపై రూపొందించిన నివేదికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈసీహెచ్‌ఓ అధ్యక్షుడు యూవిఎల్ ఆనంద, ఎఫ్‌సీఐఐ సలహాదారు డాక్టర్ రామ్ కొండిన్య, ఈస్ట్‌వెస్ట్ సీడ్స్ జనరల్ మేనేజర్ జీసీ శివకుమార్, వివిధ సంస్థల ప్రతినిధులు సురేష్‌కుమార్, గంగాధర్, శ్రీనివాస్, డి లింగయ్య, సతీష్‌హెగ్డే, శ్రీనివాస్, సుభద్రగుప్తా, మౌచుమి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేం

కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: పారిశుద్ధ్య కార్మికులు శుభ్రత కోసం పడే శ్రమ వెలకట్టలేనిదని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డిలోని వార్డు కార్యాలయంలో అమెజాన్ కంపెనీ సహకారంతో సుమారు 200 మంది కార్మికులకు నిత్యావసర వస్తువులను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ వారిని గౌరవించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు హన్మంతునాయక్, సుమన్, రాజు, శ్రీను,గోవింద్ జీహెచ్‌ఎంసీ సిబ్బంది భారత, కిష్టయ్య, మల్లేష్, అమెజాన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.